
# చదువుల్ నేర్చిన పండితాధముల్

భమిడిపాటి సోమయాజి

“హలో డయానా!” అంటూ లోపలికి వచ్చాడు ఉమ మేనమామ.

“ఏమిటి మామయ్యా! కిందటి సారి వచ్చినప్పుడు డయానాస్ లిప్ అని పిలిచావు. ఇప్పుడేమో డయానా అంటున్నావు. నీ ఇంగ్లీషు పాండిత్య మంతా మా మీద ప్రయోగిస్తున్నావు. తెలుగు లిటరేచర్ చదువుకున్న దాన్ని, నాకేం తెలుస్తాయివ్వన్నీ!” అంది ఉమ.



డయానా అంటే అందానికి దేవత. నీవు చాలా అందమైన దానివని నా ఉద్దేశం. తెలుగులో అయితే ‘కుందనపు బొమ్మ’, ‘చందనపు బొమ్మ’ అనుకో అన్నాడు మామయ్య.

“ఏమిట్రా! అంతా కులాసానా?” అని పలుకరిస్తూ “ఈ పూట ఇక్కడ భోంచేసి వెళ్ళు” అంది ఉమ తల్లి.

“దానికేంలే గానీ, ఇంజనీరు గారి అబ్బాయి ఈశ్వర్ ఈ నెల్లోనే వచ్చి పెళ్లి చేసుకుని మళ్లీ అమెరికా వెళ్లిపోతాడట కదూ!” అన్నాడు ఉమ మామయ్య.

“అవును! ఈ విషయం నీకెలా తెలిసింది?” అని అడిగింది ఉమ తల్లి.

“ఈ సంబంధం మా కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ గారు ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది” అన్నాడు ఉమ మామయ్య.

“ఉమా! మామయ్యకి కాఫీ పెట్టియ్యి. ఆ మాత్రం మర్యాద చేయకపోతే ఎలాగే? రేపొద్దున పెళ్లి బుట్ట మొయ్యాలి కదా!” అంది ఉమ తల్లి.

“ఏం పర్వాలేదు. మన ఉమ అందంగానే ఉంటుంది కదా! అందుకని మన సంబంధం వదులుకోలేరులే” అన్నాడు.

“ఏమో అంతా భగవంతుని దయ! ఇటువంటి మంచి సంబంధానికి అందరూ ప్రయత్నం చేస్తార్లే! అయినా మన ఉమ ఈశ్వర్ చిన్నప్పటి నుంచీ ఆడుకున్నవాళ్ళు. ఈశ్వర్ నాన్నగారు కూడా మన ఉమ అంటే ఇష్టపడతారు” అంది ఉమ తల్లి.

“పర్వాలేదు అన్నీ సవ్యంగానే జరుగుతాయి” అని కాఫీ తాగి వెళ్లి పోయాడు ఉమ మామయ్య.

పక్కింటి మేడమ్ ఆంటీ వచ్చారు ఉమ ఇంటికి. ఆవిడ అంటే కాలనీలో అందరికీ చాలా గౌరవం. అందుకే ఉమ ఈడున్న పిల్లలందరూ ఆమెని మేడమ్ ఆంటీ అంటారు. ఆవిడ వస్తూనే “ఏం ఉమా! ఇంక నిన్ను చూడాలంటే మేం అమెరికా రావలిసిందేనా? అయినా అది కష్టం అనుకో! అక్కడ మన హైదరాబాద్ బిర్యానీ, మిరపకాయ బజ్జీలు దొరకవు. వీలైనన్ని సార్లు ఇక్కడే లాగించెయ్యి” అంది.

ఆవిడ మాటలకి సిగ్గు పడ్డ ఉమ లోపలికి వెళ్తూ, “అమ్మా! మేడమ్ ఆంటీ వచ్చారు!” అంది.

ఉమ అమ్మగారితో “మీ ఉమ

చాలా అదృష్టవంతురాలండీ! ఈశ్వర్ లాంటి బుద్ధిమంతుడు భర్తగా పొందడానికి పూర్వ జన్మలో చాలా పూజలు చేసి ఉండాలి! అసలు పార్వతీదేవి కూడా ఈశ్వరుడి గురించి తపస్సు చేసిందట. వీళ్ల పేర్లు కూడా ఆ ఆది దంపతుల పేర్లే! అన్నీ అలా కలిసి రావాలి" అన్నారు ఆంటీ!

"ఏదో మీ దయ వలన ఈ పెళ్ళైపోతే మాకింక ఏం కావాలి చెప్పండి!" అంది ఉమ తల్లి.

"అయ్యో! అసలు విషయం మరచి పోయాను! ఉమ 'కుమార సంభవం' పుస్తకం గురించి వచ్చాను. ఒకసారి ఇస్తే చదివి ఇచ్చేస్తాను! అయినా, పెళ్లి అవకుండా, ఆ కుమారసంభవం గురించి మరచిపోవడం సహజమే!" అని ఆ పుస్తకం తీసుకుని నవ్వుకుంటూ వెళ్లిపోయింది ఆవిడ.

* * *

ఈశ్వర్ అమెరికా నుంచి వచ్చాడు. ఈసారి మాత్రం ఉమ ఇంటికి అతను రాలేదు. ఎప్పుడూ వచ్చేవాడు ఎందుకు రాలేదా అని ఉమ తల్లిదండ్రులకి దిగులు పట్టుకుంది.

"మీరే వెళ్లి, ఒకసారి ఈశ్వర్‌ని పలుకరించి రండి! మనం ఆడపిల్ల కలవాళ్లం" అని భర్తను ఈశ్వర్ ఇంటికి పంపింది ఉమ తల్లి.

అక్కడికి వెళ్లి కుశల ప్రశ్నలైన తర్వాత, ఉమ నాన్నగారు ఇంజనీర్ గారితో "ఒకసారి వచ్చి ఉమని చూడమనీ, మనం చిన్నప్పటి నుంచీ అనుకున్న సంబంధమే కదా" అన్నారు.

ఇంజనీర్ గారు బహు మేధావి. ఆయన అన్నారు– "మా ఈశ్వర్ అమెరికా వెళ్ళక ముందు మీ ఉమని మా కోడలుగా చేసుకుందామనే అనుకున్నాం. కానీ మా ఈశ్వర్ అమెరికాలోనే స్థిరపడదామని నిర్ణయించుకున్నాడు. అక్కడ తెలుగు లిటరేచర్ అవీ చదివిన పిల్లలకి ఉద్యోగాలు రావట. అమెరికాలోనే స్థిర పడిన ఒక తెలుగు కుటుంబంలోని ఇంజనీర్ చదివిన అమ్మాయిని ఇస్తామన్నారట. వాళ్ళు ఇక్కడికి వస్తున్నారు. ఆ పిల్ల వైపే మొగ్గు చూపుతున్నాడు ఈశ్వర్. వాడెన్నుకునే జీవిత భాగస్వామి విషయంలో మేమేమీ చెప్పలేకపోతున్నాం!" అని చల్లగా చెప్పాడాయన.

"మీరు దయచేసి ఈ పెళ్ళి కుదర్చకపోతే మా అమ్మాయి ఎంత కుమిలిపోతుందో ఆలోచించండి! ఆడపిల్ల మనసు కదా! తన మనసుకి తగిలిన గాయం తట్టుకోలేదు" అన్నారు ఉమ తండ్రి.

"ఈ విషయంలో నేనేం చెయ్యలేను! పెళ్ళి అనేది ఈశ్వర్ స్వంత విషయం! అదీ కాక పదహారేళ్ళు వచ్చిన పిల్లాణ్ణి తండ్రి స్నేహితుడిగా చూడాలన్న విషయం మీకు తెలియనిది కాదు! అయినా నేనొక విషయం చెబుతాను, ఏమీ అనుకోకండి. నిజంగా ఉమ మీద అంత ప్రేమ ఉంటే ఈశ్వర్ ఇండియాలోనే ఉండేవాడు. హాయిగా తను ప్రేమించిన పిల్ల, అదే మీ ఉమని పెళ్ళి చేసుకునేవాడు! అయినా జీవితంలో అనుకున్నవన్నీ అయితే ఇక కావాల్సిందేముంది చెప్పండి! మీ ఉమ, మా ఈశ్వర్ చిన్నప్పుడు ఆడుకున్న మాట నిజమే! నేను కూడా మీ సంబంధానికే ప్రాధాన్యత ఇస్తాను. అమెరికాలో, ఎంత డబ్బు సంపాదించినా చాలదు! మీ ఉమకి అక్కడ ఉద్యోగం రాదు! తెలుగు పద్యాలు గట్టిగా చదువుకుంటూ ఇంట్లో కూర్చోవాలి!" అన్నారు ఈశ్వర్ నాన్నగారు.

ఇక ప్రాధేయపడినా ఫలితం లేదని తెలుసుకున్న ఉమ తండ్రి ఇంటికొచ్చేశారు. ఆయన బాధపడుతూ విషయమంతా భార్యతో చెప్పారు. ఆవిడ కూడా ఈ వార్త విని తట్టుకోలేకపోయింది. తన కూతురి మనోభావాల్ని ఊహించుకుని బాధపడింది. ఉమకి విషయం తెలిసింది కానీ పైకి మాత్రం ఉసూరు మనలేదు. గంభీరంగా ఉండిపోయింది.

నాలుగు రోజులు గడిచాయి. శుభలేఖలు తీసుకుని ఈశ్వర్ తల్లిదండ్రులు సాదరంగా ఉమ వాళ్ళ కుటుంబాన్ని ఆహ్వానించారు. 'ఇంక ఈశ్వర్‌కి పది రోజులే శెలవు ఉందని మంచి హాలు దొరక్క ఇంటి దగ్గర్లో వున్న హోటల్లోనే పెళ్లి చేస్తున్నాం' అని చెప్పారు.

సరే! పెళ్ళి రోజు రానే వచ్చింది. అంతా హడావిడి! కానీ పెళ్ళి తంతు మాత్రం పద్ధతి ప్రకారం జరిపిస్తున్నారు. బంతులాటలు ఆడిం

## ఓడిన శునకం, గెలిచిన వ్యాఘ్రం



ఓటెయ్యడం ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకోడానికే కాదు. సినిమాలు, హీరోలు హీరోయిన్‌లకు మాత్రమే కాదు. జంతువుల ఎంపికకి కూడా ఓటెయ్యవచ్చు. అందులో పెంపుడు జంతువులూ ఉండవచ్చు అటవీ మృగాలూ ఉండవచ్చు. దేశదేశాల్లో ప్రజల "రుచులు" ఎలా ఉంటాయో కదా! పోటీకి అర్హత పొందిన జంతువులు చాలానే ఉన్నాయి. పులి, సింహం, పాము, పెంగ్విన్, కుక్క గుర్రం, చేప, చింపాంజి ఇలా లిస్టు పెద్దదే.

ఏనిమల్ ప్లానెట్ టివి ఛానెల్ చాలామంది చూస్తూనే ఉంటారు. వారు ఇటీవల ఒక పోటీ నిర్వహించారు. 50 వేలకి పైగా అభిమానులు ఇందులో పాల్గొన్నారు.

కుక్కకి అగ్రస్థానం వస్తుందని వెంటనే అనుకొంటాం. కానీ మన జాతీయ మృగం వ్యాఘ్రానికే అగ్రపీఠం దక్కింది. ఏకంగా 10,902 ఓట్లు వచ్చాయి. అయితే కుక్క మరీ వెనకబడలేదు. కాస్త తక్కువగా 10,885 ఓట్లు వచ్చాయి.

ప్రపంచం అంతా కనబడకపోయినా తనది అగ్రస్థానం అని బెబ్బులి నిరూపించుకుంది. మన ఆప్తమిత్రుడు మాత్రం కేవలం 17 ఓట్లు వెనకబడ్డాడు. రీపోలింగ్ అడిగే అవకాశం లేదేమో! ఇక డాల్ఫిన్‌కి మూడవస్థానం వచ్చింది. కానీ ఏకంగా 3000 ఓట్లు వెనక ఉంది.

పాము ఏదైనా కానీయండి. పాము పామే కొందరికి. అభిమానం లేదనుకుంటాం. విషం ఉన్నా లేకపోయినా ఆరవ స్థానం పొందింది. గుర్రం, సింహం దానికి పైన 4,5 స్థానాల్లో ఉన్నాయి. తిమింగిలానిది పదవ స్థానం. చాలా వెనకబడింది పాపం. ఏనుగుకి ఏడవస్థానం. 8,9 స్థానాలు కోతులు ఆక్రమించాయి. చింపాంజీ, ఒరాంగ్, ఉటాన్‌కి వచ్చాయి.



అయితే దేశాలవారిగా చూస్తే చాలా దేశాలు కుక్కకే ప్రథమ స్థానం ఇచ్చాయి. ఇంగ్లాండ్‌లో కోతులు, జర్మనీలో పాములు ముందున్నాయి.

**– జమ్మి కోనేటిరావు**

## "నా పాట"



నా పాటకు ప్రాణం
మనసులోని భావం
భావం పొంగి పాటలో నిండి
తేలి సాగుతోంది గాలి అలలపై
ఉదయించే సూర్యుడికి
కమలాలతో బంధం
వెలిగే చంద్రుడికి
కలువల అందం
వినే మనసుకే
ఈ పాట అంకితం
వారి ఆదరాభిమానమే
నాకు బంగారు పతకం
ఈ పాట లాలిగ
ఈ జగమే ఊయలగా
ఆదమరచి అందరూ
నిదురపోతే పాపల్లాగ
పాడిన నా మనసుకు ఆనందం
పాటలోన కనగలను
నా జీవన గమ్యం!

– రోహిణీ సత్య

చారు. ఉయ్యాల కూడా వేశారు. చందనం బొమ్మ కావాల్సి వచ్చింది. ఈ తంతు ఉంటుం దని తెలియని ఆడపెళ్ళివారు చందనం బొమ్మ మాత్రం తేలేదు. అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటింది. అప్పుడు చందనం బొమ్మ ఎక్కడ దొరుకుతుంది?

ఈశ్వర్, వాళ్ళ అక్క చెవిలో మెల్లిగా ఏదో చెప్పాడు. ఆవిడ ఉమ తల్లిగార్ని తీసుకుని కార్లో ఉమ ఇంటికి వెళ్లి చందనం బొమ్మ తీసుకు వచ్చింది. ఆ చందనం బొమ్మతో చిన్న ప్పుడు ఈశ్వర్, ఉమ చాలాసార్లు ఆడుకు న్నారు. ఇసుకలో గుడి కట్టి ఉత్తుత్తి పెళ్ళిళ్ళు చేసి పప్పు బెల్లాలు పంచి పెట్టారు. ఆ బొమ్మే నిజం పెళ్ళిలో కావాల్సి వచ్చింది.

పెళ్ళి తంతు పూర్తి అయింది. ఉమ కుటుంబం అంకురార్పణ నుంచి అప్పగింతల వరకూ అక్కడే ఉండిపోయారు. మధ్యలో వెళ్ళి పోతే ఈర్ష్యతో వెళ్ళిపోయారని చెడ్డ పేరొస్తుందే మోనన్న భయం! వాళ్ళది చిరకాల స్నేహం!

✻ ✻ ✻

ఇంటికి వచ్చి మంచం మీద నడుం వాల్చిన ఉమకు 'పడచుల్ వేడుక బొమ్మ రిడ్డిసుకలో బాగొప్ప నిర్మించి, చొప్పడ ముగ్గుల్ పచరించి ఆడుకొని ఆ పై నాటి గొల్లంచు కట్టడముల్ పాడొనరించి...' అనే చింతామణీ శతకం లోని పద్యం జ్ఞాపకం వచ్చింది.

"ఉమా! నువ్వేం దిగులు పడకు. నీకు మంచి సంబంధం చూస్తాంలే!" అంది ఉమ తల్లి.

"అసలా చందనం బొమ్మ ఎందుకిచ్చా వమ్మా! అది మన పనా! కన్యా దాతలు మీరు కాదు కదా!" అని ఉక్రోషంతో అడిగింది ఉమ.

"పోన్లే తల్లీ! ఎదుటి వాళ్ళకి చేసిన సాయం వెయ్యింతలై మనకి తిరిగొస్తుంది ఎప్పటికైనా!" అంది ఉమ తల్లి.

పెళ్ళైన తర్వాత తిరిగి అమెరికా వెళ్ళేటప్పుడైనా ఉమ వాళ్ళతో చెప్పకుండా వెళ్ళిపోయాడు ఈశ్వర్!

తర్వాత ఒక రోజు "ఆ చందనం బొమ్మ తీసుకురామ్మా!" అని ఈశ్వర్ ఇంటికి పంపింది ఉమ తన తల్లిని.

ఆ బొమ్మ గురించి వెళ్ళి వచ్చిన ఉమ తల్లి చెప్పింది– "ఆ బొమ్మ ఈశ్వర్ అమెరికా వెళ్ళిం తర్వాత కనపడలేదట. ఫ్లైట్‌కి వెళ్ళే ముందు ఈశ్వర్ చేతిలో ఆ బొమ్మ అతని తల్లి చూసిందట! బహుశా ముచ్చట పడి ఈశ్వరే ఆ బొమ్మ అమెరికా తీసుకెళ్ళి ఉంటాడట!"

అది విన్న ఉమ అనుకుంది "నా జీవితం ఒక బొమ్మలాటయిపోయింది. చిన్నప్పటి నుంచీ ఈ సంబంధమే అవుతుందనుకున్నాను. తేడా జరిగితే ఆడపిల్ల మనసెంత కుమిలి పోతుందోనని కూడా తలచలేదు ఆ మహా ఇంజనీరింగ్ పండితులైన తండ్రీకొడుకులు! ఆ ప్రాణం ఉన్న మగ బొమ్మ దక్కలేదు సరికదా, చిన్నప్పటి నుంచీ ఆడుకున్న చందనం బొమ్మ కూడా చేజారిపోయింది.

అప్పుడే వచ్చిన మేనమామతో తన బొమ్మ తన్నుంచి వేరైనట్లు చెప్పింది.

"ఏం చేస్తాం? ప్రాణం ఉన్న చందనం బొమ్మ ఇండియాలో ఉండిపోయింది. ప్రాణం లేని చందనం బొమ్మకు రెక్కలొచ్చి ఎగిరి పోయింది" అన్నాడు మేనమామ.

"ఉండు మామయ్యా! కాఫీ తెస్తాను!" అని లోపలికి వెళ్ళిపోతుంటే "వద్దులే! మంచి తెలుగు పద్యం చదివి వినిపించవే ఉమా!" అన్నాడు మేనమామ.

ధూర్జటి రాసిన "చదువుల్ నేర్చిన పండితాధముల్" పద్యం చదివి వినిపించింది ఉమ. ✻

